క్లుప్తంగా

ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మశ్చేందర్

పెద్దశంకరంపేట(మెదక్): ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి గుర్రపు మశ్చేందర్ మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఓటర్లతో మాట్లాడి సింహం గుర్తుకే ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. తనకు ఓటేసి గెలిపిస్తే జహీరాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, యువతకు ఉపాధి, రైతులకు భరోసా కల్పిస్తానన్నారు. పదేళ్లుగా ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్లు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

40 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో గురువారం వైద్యసిబ్బంది ఏసీఎఫ్(ఆక్టివ్ కేస్ ఫైండింగ్) క్యాంపు నిర్వహించారు. గ్రామంలోని పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్) శివకుమార్, ఏఎన్ఎం ప్రమీల పంచాయతీ వద్ద ఏసీఎఫ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మందికి టీపీటెస్టుతోపాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్ ప్రవళిక, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీజేపీ గెలుపు ఖాయం



బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ వెల్దుర్తి మాజీ ఉప సర్పంచ్ కర్రె వెంకటేశం, ఆరెగూడెం మాజీ వార్డు సభ్యుడు కుస్తి బాలకిషన్, మెల్లూర్‌కు చెందిన నెల్లూర్, ఎల్కపల్లి యాదగిరి తదితరులు అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నర్సింహులు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆదేశాలతో తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి

అల్లాదుర్గం(మెదక్): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం వెలువడడంతో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు అల్లాదుర్గంలో రహదారిపై వాహనాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు కఠినంగా అమలు చేస్తామన్నారు. అక్రమంగా మద్యం, డబ్బు తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

నర్సాపూర్: మండలంలోని ఆవంచలో నిర్మించిన వీరాంజనేయ, శివ పంచాయతన సమిత నాభిశిల(బొడ్డురాయి) ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మధుసూదన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రఘువీరారెడ్డి, కరుణాకర్, జగన్, విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. 19న గణపతిపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 21న రంగంపేట పీఠాధిపతి మాధవానంద స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంటు జక్కుల వెంకటేశ్ ఆలయ నిర్మాణానికి రూ.10,111 విరాళం అందజేశారు.

బంకు బంద్

- సొసైటీ పెట్రోలు బంకుపై ఆశలు
- ఏర్పాటైన ఏడాదికే మూత
- రెండేళ్లుగా ఇదేపరిస్థితి
- త్వరలోనే ప్రారంభిస్తాం: పాలకవర్గం



మూతబడిన పీఏసీఎస్ పెట్రోల్ బంకు

పీఏసీఎస్ సొసైటీ పెట్రోలు బంకు రైతులకు ఎంతో ఆసరాగా ఉండేది. మిగతా బంకుల కంటే కొంచెం తక్కువకే దొరకడంతో మండలంలో చాలా మంది దీనిపైనే ఆధారపడేవారు. కేంద్ర ప్రభుత్వ పథకాలవల్ల నష్టాల బాటపట్టి మూతదిశగా సాగింది. తమకెంతగానో అనువుగా ఉండే ఆ బంకు మళ్లీ తెరుచుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): పీఏసీఎస్ సోమక్కపేట్ మండలంలోనే ఏకైక సొసైటీ కావడంతో మంచి లాభాలలో సాగుతోంది. అయితే రైతులకు రుణాలతోపాటు, ఇంకేదైనా సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో చిలప్‌చెడ్ శివారులో శీలాంపల్లి గేటు వద్ద ఫిబ్రవరి 2021లో పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. ఈ బంకు ఏర్పాటుకు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి స్థలాన్ని అద్దెకు తీసుకున్నారు. రూ.2లక్షలు అడ్వాన్స్ చెల్లించి, నెలకు రూ.10వేలకు మాట్లాడుకున్నారు. పీఏసీఎస్ పెట్రోల్ బంకు కన్జ్యూమర్ పంప్ కావడంతో లాభాలు బాగానే వచ్చేవి. దీంతో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, రైతులకు డీజిల్‌పై ఒక రూపాయి తగ్గించి అమ్మేవారు. సుమారు ఏడాదిపాటు పెట్రోలు బంకు బాగానే నడిచింది. కాలక్రమేణా కేంద్రప్రభుత్వ పథకాలలో భాగంగా సొసైటీ పెట్రోల్ బంకులకు రిటైల్ బంకు కంటే అధిక ధరలకు చమురు అమ్మడంతో నష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో నిర్వాహకులు బంకును మూసివేశారు. అయితే తమకు ఎంతోకొంత ఆసరాగా ఉండడంతో రైతులు సొసైటీ పెట్రోల్ బంకు ఎప్పుడు తెరుస్తారోనని ఎదురు చూస్తున్నారు.

ప్రారంభిస్తారని ఆశాభావం

సొసైటీ పాలకవర్గం, సిబ్బంది పెట్రోల్ బంకును తిరిగి ప్రారంభించడంలేదు. స్థలం యజమానికి నెలకు రూ.10వేలు అద్దె మాత్రం చెల్లిస్తూనే ఉన్నారు. అలాగే నిర్వహణ ఖర్చులకు, వాచ్‌మెన్ జీతానికి మరో రూ.10వేలు కూడా చెల్లిస్తున్నారు. అయితే త్వరలోనే ఈ బంకు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ నెలలో నిర్వహించిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో పాలకవర్గ సభ్యులు తెలిపారు.

ప్రారంభంలో బాగానే ఉంది



పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు ప్రారంభంలో బాగానే నడిచింది. రైతులకు డీజిల్‌పై రూపాయి తగ్గింపు ఇవ్వడంతో మండల వ్యాప్తంగా ఉన్న రైతులు సొసైటీ బంకులోనే డీజిల్ కొనుగోలు చేసేవారు. సొసైటీకి సైతం ఆదాయం బాగానే వచ్చేది. రెండేళ్లుగా బంకు బంద్ చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

– చంద్రశేఖర్ రెడ్డి, రైతు, చండూర్

త్వరలోనే తిరిగి ప్రారంభిస్తాం



సొసైటీ పెట్రోల్ బంకును తిరిగి ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. కన్జ్యూమర్ పంప్ నుంచి రిటైల్ పంప్‌గా మార్చుకునేందుకు జూన్ 2023లో ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మా ప్రయత్నంలో భాగంగా పాలకవర్గ సభ్యులతో కలసి బంకును ప్రారంభించేందుకు అధికారులను సంప్రదిస్తున్నాం. త్వరలోనే బంకును ప్రారంభించి. రైతులకు తగ్గింపు ఇస్తాం

– పోచయ్య, సీఈఓ, పీఏసీఎస్ సోమక్కపేట్

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా

ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా గ్రామ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మల్కాపూర్, గొట్టిముక్కల తదితర గ్రామాలలోని నర్సరీలతోపాటు పంచాయతీ కార్యాలయాలను ఆమె తనిఖీ చేశారు. పంచాయతీలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. అలాగే ఉపాధిహామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

కొనసాగుతున్న ఇంటింటి ప్రచారం



శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి కూలీలకు కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నేత



పెద్దశంకరంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో గురువారం పేటతో పాటు వీరోజిపల్లి, ముసాపేట, కట్టెలవెంకటాపూర్, కోళాపల్లి, ఇసుకపాయలతాండాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రావణ్, శ్రీహరి, కృష్ణ, అనిల్, సంగమేశ్వర్ తదితరులున్నారు.

బీజేపీతోనే దేశానికి రక్ష..

అల్లాదుర్గం(మెదక్): బీజేపీతోనే దేశానికి అన్ని రంగాలలో రక్షణ ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకుడు రాములు అన్నారు. గురువారం మండల పరిధిలోని మందాపూర్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సాయిలుగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి మంచి స్పందన

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందర్‌రావుకు మద్దతుగా కమలం పువ్వుగుర్తుకు ఓటేయాల్సిందిగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని రవి, అశోక్ అన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి, పాల్గొన్న భక్తులు

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన భవాని రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. పండితుడు మాధవానంద సరస్వతి పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భవాని రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలను సన్మానించారు.

బాల్యవివాహాలు చేయొద్దు

ఐసీపీఎస్ అధికారుల కౌన్సెలింగ్

కౌడిపల్లి(నర్సాపూర్): బాల్యవివాహాలు చేయొద్దని ఐసీపీఎస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం కౌడిపల్లి మండలం శేరితండాలో బాల్యవివాహానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందింది. దీంతో కలెక్టర్, డీడబ్ల్యూఓ ఆదేశాల మేరకు ఐసీపీఎస్ అధికారులు శంకర్‌గౌడ్, నర్సింహులు, సరిత తండాకువెళ్లి బాల్య వివాహానికి ఏర్పాట్లు చేస్తున్న తల్లిదండ్రులు, తండావాసులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వివాహ వయసు వచ్చేంతవరకు పెళ్లి చేయొద్దని కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులచేత హామీ పత్రం రాయించుకున్నట్లు చెప్పారు. బాల్యవివాహం చేసినట్లయితే తల్లిదండ్రులతోపాటు, పెళ్లి పెద్దలు, బంధువులు, పంతులుపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ రాక

రామాయంపేట(మెదక్): మండలంలోని ఆర్.వెంకటాపూర్ గ్రామానికి శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రానున్నారు. నాలుగు రోజుల క్రితం ఆర్.వెంకటాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహం చేతి వేలును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈ విషయమై విచారణకోసం ఆయన రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్ తెలిపారు. దళిత సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో వెంకటాపూర్‌కు తరలిరావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని గ్రామ శివారు వ్యవసాయ పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ ఇంజన్ నుంచి బ్యాటరీని ఎత్తుకెళ్లిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మల్లారెడ్డి పొలం వద్ద ట్రాక్టర్లు ఉంచగా ఉదయం చూసేసరికి బ్యాటరీ చోరీకి గురైనట్లు గమనించాడు. మరోవైపు రంగంపేటలోని కొత్తచెరువు సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద నుంచి కేబుల్ వైర్లు, ప్లాస్టిక్, ఇనుప పైపులు చోరీకి గురైనట్టు ఆ గ్రామ రైతులు కూడా తెలిపారు.

క్రీడా సామగ్రి అందజేత

దుబ్బాకటౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట ప్రభుత్వ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు నరేష్ అన్నారు. గురువారం హెచ్ఎం శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దడమేకాకుండా వారికి తన సొంత ఖర్చుతో క్రీడా సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు.

గజ్వేల్ రోటరీ చేయూత

ములుగు(గజ్వేల్): మండలంలోని బహిలంపూర్ ఆర్అండ్ఆర్ కాలనీలో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపు కాలిపోయిన ఘటనలో నష్టపోయిన కుటుంబానికి గజ్వేల్ రోటరీక్లబ్ అండగా నిలిచింది. క్లబ్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు బాధితుడు కుమ్మరి రాజుకు గురువారం రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నర్సింహారెడ్డి, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్లు వెనక్కి తీసుకున్నారు



మాట్లాడుతున్న గౌతమ్

దివ్యాంగుల ఆవేదన

చేగుంట(తూప్రాన్): దివ్యాంగులకు ఇవ్వాల్సిన ట్రైసైకిళ్లు ఇచ్చి వెంటనే వెనక్కి తీసుకున్నారని ఎన్‌పీఆర్డీ దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని ఇబ్రహీంపూర్‌లో దివ్యాంగుడు నర్సింహులు ఇంటి వద్ద గురువారం సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశారని కాని వాటిని మళ్లీ వెనక్కి తీసుకున్నారని ఆరోపించారు. దివ్యాంగులకు న్యాయం చేయని నాయకులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగులు శేఖర్, స్వామి తదితరులు ఉన్నారు.

ఘనంగా కోదండరాముని ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో కొలువైన కోదండ రామస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన గురువారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులు స్వామివారికి హారతులిచ్చారు. కార్యక్రమంలో వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ, చందు పంతులు, ఉత్సవ నిర్వాహకులు ఉన్నారు.



పల్లకిసేవ నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ దుర్గమ్మ దేవతకు బండ్ల ప్రదక్షిణలు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో దుర్గమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ జాతరలో భాగంగా గురువారం బండ్ల ప్రదక్షిణలు నిర్వహించారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బండ్లను కట్టి ఉరేగింపుతో ప్రదక్షిణలు చేశారు. బండ్ల ముందు శివసత్తుల నృత్యాలు, భక్తులు భాజాభజంత్రీలతో డాన్సులు చేశారు. ఉత్సవాలలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశారు.

◆ రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో కొలువైన రేణుకామాత ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు గౌరీగణపతి పూజ అఖండ దీపారాధన, 22న ప్రత్యేక అభిషేకాలు, 23న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, గౌడ సంఘం సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ రోడ్లపైనే ధాన్యం ఆరబోత

చిన్నకోడూరు(సిద్దిపేట): ధాన్యాన్ని ఆరబోయడానికి కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా స్థలం లేకపోవడం, కల్లాల నిర్మాణం చేపట్టక పోవడంతో రైతులు రోడ్లపైనే ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు ఈ రోడ్లపై రాకపోకలు సాగించాలంటే జంకుతున్నారు. రాత్రి వేళలో ధాన్యం కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా కమ్యూనిటీ హాల్



పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ 15ఏళ్లుగా అసంపూర్తిగా ఉంది. గతంలో ఈ కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు మంజూరు కాగా పిల్లర్లువేసి బేస్‌మెంట్ నిర్మించారు. నిధులు సరిపోకపోవడంతో అప్పటి నుంచి అసంపూర్తిగానే ఉంది. నిధులు మంజూరుచేసి నిర్మాణం పూర్తి చేయాలని ఎస్సీ కాలనీవాసులు కోరుతున్నారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



బెజ్జంకి ఆలయంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి విగ్రహం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహోత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఏటా చైత్ర మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డితో పాటు మహారాష్ట్రలోని ముంబై, బీవండి, షోలాపూర్, కర్ణాటకలోని బలార్ష తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఏప్రిల్ 19వ తేదీ నుంచి 25వ తేదీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామి వారిని ప్రతీరోజూ గ్రామంలో ఊరేగిస్తారు. 19వ తేదీన స్వామివారి తిరుకల్యాణం, 23న శకటోత్సవం, 24వ తేదీన రాత్రి 25వ తేదీ తెల్లవారుజామున రథోత్సవం నిర్వహిస్తారు. కోనేరులో స్నానమాచరించి ఆలయానికి ఉత్తర దిశలో ఉన్న ఏకశిల అండాలు స్తంభానికి 11 ప్రదక్షిణలు చేసి ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సంతానం కలిగినవారు వచ్చి ఒడిబియ్యం పోసి వెళ్తుంటారు.



అండాలు స్తంభం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

బ్రహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ ఈఓ పీవీ శర్మ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున అమలులో ఉన్నందున అధికారుల పర్యవేక్షణలో వసతులు సమకూరుస్తున్నారు. కరీంనగర్, సిద్దిపేట తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది.

సాధ్యంకాని హామీలతో మోసం

కొమురవెల్లి(సిద్దిపేట): సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బూర్గోజు నాగరాజు అన్నారు. గురువారం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపుకోసం మండలంలో ఇంటించి ప్రచారం నిర్వహించారు. దేశ భద్రత, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.